పశ్చాద్భూమి

ఆ రోజు ప్రతిరోజు మాదిరిగానే తెల్లవారింది. ఎర్రడాలుగా తిరిగింది ఆకాశం. అంతదాకా తెల్ల తెల్లగా వుంది. మసక మసకగా ఉన్న మంచు తెరలు విచ్చిపోయాయి. తడితడిగా చెమ్మ చెమ్మగా ఉన్న లోకం మీదికి వచ్చిన సూర్యుడు నేల వెన్నుమీద రసిక గారుతున్న పుండులాగా వున్నాడు.

రాత్రి జ్వరంతో వేగిపోయిన పిల్లాడు పాడుచేసిన బట్టలు బాత్‌రూంలో పడేసి వచ్చిన ఇల్లాలితో 'నీకెంత ఓర్పే' అన్నాడు భర్త. మంచంమీదే అన్నీ అవుతున్న భర్త దగ్గర బక్కెట్ లేపెట్రీలో క్రుమ్మరించి, నీళ్లుపోసి తొరపి వచ్చింది భార్య. ఆమె వైపు నీళ్ళునిండిన కళ్లతో చూశాడు నోట మాటలేనిరోగి. దొడ్డికిపోయి ఇసుకలో కూర్చుని పిచ్చిగీతలు చూపుడు వ్రేలితో గీస్తున్న తమ్ముణ్ణి కసురుకొని లాక్కువచ్చి నీళ్లు కడిగి నట్టింటిలో కుదేసింది అక్క. చావు బ్రతుకులమధ్య కొట్టుమిట్టాడుతున్న మామ వాంతులూ బేదులు చేసుకొంటే రాత్రి అంతా నిద్రను దూరంగావుంచి దగ్గరగా కూర్చున్న ఇంటి పెద్దకోడలు తెల్లవారిం తర్వాత కునుకుతూ వుంది. హాస్పటల్‌లో దిక్కులేని పక్షి ఎవరో అపస్మారకంగా వుంటే ఆమె బెడ్ దగ్గరనుంచి పేన్ పేన్‌తీసి తోటీకిచ్చింది నర్సు.

రాంకోటి గుంట లోతూ పొడుగూ వెడల్పూ చూశాడు. రెండు బారలుంది లోతు. బాగా పదిబారలుంటుంది పొడుగూ వెడల్పూ! నిలువెత్తున చుట్టూ పోగుబడ్డ ఎర్రకండమట్టి ముద్దలు ముద్దలుగా వుంది. పై ఇసుక క్రిందికయి, క్రిందిమట్టి పైకివచ్చి తెలుపు ఎరుపుల కలగలుపుగా వున్నమట్టి కుప్ప ఎక్కి గుంటలోతు చూసి నగరంవైపు కళ్ళు త్రిప్పిచూశాడు.

రోడ్డు కనిపించింది. ఏవో తిరుగుతూ వున్నాయి. తను చూచేది

కనిపించలేదు. నగరందాటి మలుపు తిరిగితేతప్ప కనిపించదు లారీ! నగరం అంతటా పొగ కావురు గమ్మింది. ఆ సమయంలో ప్రతియింటిలో పొయి రగులుకొంటూ వుంటుంది.

రాంకోటి భార్యకు వయస్సు పైబడినా వృద్ధాప్యం తొంగిచూడలేదు. చీరె రెండు కాళ్లకూ అంటుకు పోయేట్లు కట్టుకొంది. పైట చెంగు నడుం చుట్టూ త్రిప్పి రొంటిలో దోపుకొంది. ముక్కు పుడకమీద క్షణకాలం నిలిచి జారిపడిన చెమటబొట్టు ఓష్ఠంమీద చెమ్మగిల్లిపోతుంటే మోచేతితో తుడుచు కుంది. నగరంలో విశ్రాంతిగా విశాలంగావున్న పేటలో ఇళ్లవెనుక భాగం లోంచి నెత్తిమీది పల్లికతో రోడ్డుమీదికి వచ్చింది. మలుపులో ఉన్న తారు డబ్బాలో పల్లిక కుమ్మరించి, నెత్తిమీది కుదురు సరిజేసుకొని, రెండు మోచేతులతో ముఖమంతా తుడుచుకొని ప్రక్కసందులోకి వెళ్ళింది.

కాలి చిటికెనవ్రేలికీ, బొటనవ్రేలు ప్రక్కవ్రేలికి ఉన్న మెట్టెలు, కాళ్ళ కడియాలు నడుస్తుంటే మోగుతుండగా గొందిలోంచి తిరిగి, సందు దాటి వీధిలోకి వచ్చింది ఇరవైఏళ్ళ రాంకోటి కోడలు. ముక్కు చక్కగా ఉన్నా, ముఖం ముచ్చటగా ఉన్నా ఆమె కవేమీ తెలియవు. ముక్కుమూసు కొని, ముఖం చిట్లించి, చూచీ చూడకుండా చూచే ఇరుకుపేట ఇళ్లలోని యువకులకు ఆమె ఆకారం తెలుసు. చంకలోఉన్న బుట్ట తారు డబ్బాలో దిమ్మరించి మళ్ళీ గొందుల్లోకి వెళిపోయింది.

నగరంలో ప్రక్కప్రక్క రోడ్లమీద లారీ వస్తూవుంది. మిలిటరీ హోటల్లో పలావ్ వండిన పెద్దరాగిపాత్ర పొయిసెగకు పొగ చూరిపోయి నట్లుంది లారీ. వంకర్లుటింకర్లు తిరిగి, కాశీమజిలీ కథల్లో రాక్షసుడులాగా వుంది. అది రోడ్డుమీద ఆగివుంటే ఫర్లాంగుదూరంలో మనుష్యుల ఆకారాలు కాదు, అలికిడి కూడా వుండదు. అది ఆగిపోతుంటే ఎదురుగావచ్చే మనుష్యులు ముక్కులు మూసుకొని కళ్ళు చికిలించి దిక్కులు చూస్తూ నిల బడతారు. రిక్షాలు, సైకిళ్లు ప్రక్కసందుల్లోకి వెళిపోతాయి. కార్లు తప్పని సరయితే ఆగమేఘాల మీద దూసుకుపోతాయి.

పేటలో ఉన్న తారుడబ్బాలు ఎక్కించుకొని రెండు షైర్లబండిని

ఈడ్చుకువస్తున్న ఎద్దు పేడకడి వేసింది. బండి వెళిపోయాక పక్కింటి ఇల్లాలు బుట్టలో పేడకడి వేసుకొని తీసుకుపోయి, ఇంటిముందు కళ్ళాపి కొట్టింది. పైరుబండిమీద ఉన్న తారుడబ్బాలు చొట్టలుపడి, నొక్కులుపడి వంకర్లు తిరిగి, పురావస్తుపరిశోధనశాఖలో భద్రపరుపదగిన వస్తువుల్లాగా వున్నాయి.

పైరుబండి ఎదురైనచోట లారీ ఆగింది. లారీ డ్రైవర్ ప్రక్కన కూర్చున్న చిన్నరాంకోటి—రాంకోటి కొడుకు—పాతికేళ్ళవాడు, క్రిందికి దిగాడు. తారుడబ్బాలు మెల్లగా లారీలోకి ఎక్కించుకొన్నాడు. అతని చేతులు బలంగా వున్నాయి. మడికట్టు లావుగావుంది. తారుడబ్బా బలంగా పైకిలాగుతుంటే అతని దండెకడియం బిర్రబిగిసిపోయింది. మోకాళ్లదాకా మడిచిన అతుకుల పేంట్ పూనికతో డబ్బా పైకి లాగుతున్నప్పుడు మోకాళ్లదగ్గర బిర్రుగా బిగిసింది.

ఆ పాకకు నిట్రాడిలేదు. రెండుప్రక్కల కాశీగుంజలపైన అడ్డంగా వేసిన లావుపాటి బొంగుమీంచి క్రిందికి జారిన వెదురు తుంటెలమీద పడేసిన చినిగిన చాపతుంపుమీద బాచిపట్టువేసు క్కూర్చున్నాడు రాంకోటి.

మోకాళ్ళదాకావున్న కాకీనిక్కరు ఉండవలసిందానికంటే వదులుగా వుంది. పైన ఉన్నది చొక్కాకాదు. కురుచచేతులు జబ్బలు దాకాకూడా రాలేదు. ముతకబట్ట. బనీను కాదు. దానికంటే పెద్దది. మిషన్‌మీద కుట్టించిదే! శ్లాక్‌లాగా లేదు. కుదిమట్టసంగా నడుందాకా వుంది. నిక్కరు జేబులుకూడా మూయలేదు, ఆ గుడ్డ బనీనువంటి చొక్కా!

ఎడంచేతిప్రక్క క్రిందిభాగంలో లోపలవైపునున్న జేబులోంచి రాంకోటి పొగాకుకాడ తీశాడు. అంతా బారుగా చుట్టుకుపోయివున్న దాన్ని వెడల్పు చేశాడు. మొదట్లో పట్టుకొని, కొసనుంచి కాడపీకి వేరుచేశాడు. రెండుప్రక్కలఉన్న పాయల్లో ఒకటి సాపుచేసి చాపమీదపెట్టి మిగతా పొగాకు బారుగా సాగదీసి, తుంపులుతుంపులుగాచేసి, పాయలో పొదిచేసిపెట్టి చుట్ట చుట్టాడు. ఆ జేబులోంచి అగ్గిపెట్టితీసి పుల్లలాగి, వెలిగించి, రెండువేళ్లమధ్య చుట్ట నోట్లో పెట్టుకొని బుగ్గలు చొట్టలు పడేట్టుగా-రెండుప్రక్కలనుంచి

చెంపలు పట్టుకారుతో ఒత్తిపట్టినట్లు లోపలికి పోయేట్లు పొగపీల్చి గవదలు ఉబ్బించి పొగ వదిలిపెట్టాడు రాంకోటి. పొగ తాపీగా వదులుతూ ఎదురుగా అల్లంతదూరంలో ఉన్న గుంటవైపు చూస్తున్నాడు.

కాళ్లు అరజాపి, మోకాటిచిప్పలు చేత్తో రుద్దుకొంటూ కుతిదీరా చుట్ట కాల్చుకొంటున్నాడు. రాంకోటి పొట్టిగా గిడసబారి ఉన్నాడు. కళ్ళు చిన్నవి. కనురెప్పలపై వెంట్రుకలున్న జాడలేదు. బోడితలమీద వెంట్రుకలు అక్కడొక్కటి ఇక్కడొకటి వున్నాయి. తల నున్నగాలేదు. కాశీకాశీగా తెల్ల వెంట్రుకలు చెదురు మదురుగా వున్నాయి. చెంపలు ఎండి ముడతలుపడి పెళుసుగా ఉన్న తమలపాకులు లాగున్నాయి. రెండు పెదవులు కలిసే రెండు చోట్ల రెండు రైలింజన్లు ఢీకొంటే పట్టాలు చెక్కలు వంకర్లు తిరిగిపోయినట్లు ముడుతలున్నాయి. ఆ ముడుతలపైన పదేసీ వెంట్రుకలు బారుగా క్రిందికి చూస్తూ వెండిదారాలు అతికించినట్లు మీసాలున్నాయి. పై పెదవిమీద, ముక్కుక్రింద పెదవి కొసదాకా వెంట్రుకలు లేవు. అక్కడ నున్నగావుంది. నూనే రాసిన లేత తమలపాకు మెరిసినట్లుగా మెరుస్తూవుంది. ముక్కు రంధ్రాల లోపల వెంట్రుకలులేవు. వెంట్రుకల పాదుల ఉనికి కూడా లేదు. జోడుగుళ్ళ తుపాకీ బేరల్స్ మెరిసినట్లు మెరుస్తున్నాయి ముక్కుగోళ్ళు, లోపలిభాగాలు. చావముందు విడిచిన అరిగి పీలికలయిన చెప్పులు ఉంగటాలు తెగి వికృతంగా వున్నాయి. చేతివ్రేళ్ళు ఆకారానికి మించినంత బారుగా వున్నాయి.

మునసబు కొడుకు మునసబు, కరణం కొడుకు కరణం, వెట్టివాడి కొడుకు వెట్టివాడు అయినట్లు రాంకోటి కొడుకు రాంకోటి-తండ్రి తర్వాత పొలంపుట్రా నగానట్రా ఇల్లూవాకిలీ మళ్లూమాన్యాలు కొడుకు సంరక్షించు కొన్నట్లు, అవ్వ ఆభరణాలు తల్లికి, తల్లి సొమ్ములు కూతురుకు, కూతురు నగలు కూతురు కూతురుకూ తరతరాలనుంచి సంక్రమించినట్లు, తద్దినాలుపెట్టే తండ్రి కొడుకు తద్దినాలు పెట్టినట్లు, వ్యాపారి కొడుకు వ్యాపారం నిలబెట్టు కొన్నట్లు, వంశపారంపర్యంగా వస్తున్న ఆస్తినీ, హక్కునూ-నిలబెట్టు కొన్నాడు.

రాంకోటి వయస్సు అరవై దాటింది. అతనికి ముగ్గురు కొడుకులు. పెద్దవాళ్ళిద్దరూ తండ్రి అంతటివాళ్ళు కాలేదు. ఏదో చదువు మిణికారు. చాలీచాలని జీతాలతో చచ్చే చావు జస్తూ ఉద్యోగాలంటూ వెలగబెడుతున్నారు. వాళ్ళ సంసారాలు పిల్లా జెల్లా, ఏవో బాదలు పడుతున్నారు. చిన్నవాడికి చదువు అబ్బలేదు. అందుకే రాంకోటి అయ్యాడు. పెద్దరాంకోటి పలుకుబడి వల్ల చిన్నరాంకోటికీపాటి ఉద్యోగం అయినా చిక్కిందిగానీ లేకపోతే అందుకూ పనికిరాని ఆటకాయతనం ఉన్న రాలుగాయ! పెద్ద రాంకోటికి ఆడ పిల్లలులేరు. ఇద్దరు కోడళ్లు పెద్దవాళ్ళు కాపరానికి వచ్చినట్లేవచ్చి వెళి పోయారు భర్తలవెంట బాధ్యతలు మోసుకొంటూ. చిన్నకోడలు ఇంట్లోనే వుంది అత్తమామలను నమ్ముకొని. చిన్నకోడలే పెద్దరాంకోటికి కూతురులేని లోపం తీర్చింది. చిన్నరాంకోటికి ఇంకా పిల్లలు కలగలేదు.

కాలం ఎంత ముందుకు పోయినా, పోకపోయినా, పట్టణానికొక రాంకోటి పదిలంగా ఉంటాడు. జబ్బుచేసిన నగరానికి, చీడ పట్టిన వీధులకు, ప్రతియింట వెలుపల తూగుతున్న జాతికి పరిచర్య చేసేందుకు బస్తీల్లో, పట్టణాలలో, నగరాలలో, అమ్మలాగో, అక్కలాగో, అత్తలాగో, కోడలు లాగో, భార్యలాగో నర్సులాగో, అందరి ఏకరూపంలాగో, స్త్రీకాని రాంకోటి స్త్రీలాగా మారి వుంటాడు. రాజులు మారిపోయి, రాజ్యాలు మారిపోయి ప్రజలే రాజులయి, ప్రభుత్వాలే ప్రజాలయినా కావచ్చు. ఏది ఏమయినా కావచ్చు. కాని మానవజాతి మనుగడ వున్నంతవరకు రాంకోటి మారడు. ఒక రాంకోటి కాకపోతే మరో రాంకోటి. ఇంకో రాంకోటి వేరో రాంకోటి! రాంకోటి శాశ్వతం! రాంకోటి నిరంతరం! రాంకోటి కలకాలం! రాంకోటి చిరంజీవి!

మొదటి లారీ వచ్చింది. ఆ పాటికి చుట్ట సగం కాలిపోయింది. నోట్లో ఉన్న కొనకొరికి, ఉమ్మివేసి, కాలుతున్న ప్రక్క నుసిరాల్చి, నేలమీద రాసి, ఆరిపోయింతర్వాత చెవిలో దోపుకొన్నాడు రాంకోటి. పెద్దరాంకోటి లారీతో వచ్చిన చిన్నరాంకోటిని చూశాడు వెలుపలికి వచ్చి. లారీ ఆగింది.

'ఏరా తెచ్చా?'

'ఆఁ!'

చిన్న రాంకోటి గుడ్డమూట పాకలో పెట్టాడు లారీ సీటులోంచి తీసుకు వచ్చి. లారీ గుంటదగ్గర నిలబడింది. ఇద్దరూ లారీ దగ్గరకు పోయారు. తారు డబ్బాలుదించి, గుంటలోకి కుమ్మరించి, బారు కఱ్ఱకు కట్టిన దువ్వెన వంటి ఇనుపకొక్కీల పరికరంతో తారు డబ్బాలుగీరి, మళ్ళీ డబ్బాలు లారీ లోకి ఎక్కించారు. లారీ మళ్ళీ నగరం అభిముఖంగా నిలబడింది. డ్రైవర్ బీడి ముట్టించుకొన్నాడు.

'రేయ్ రాముడు!'

'ఏంది?'

చొక్కావంటి బనీను ఎడం ప్రక్కఉన్న జేబులోఁచి పర్సు తీశాడు పెద్దరాంకోటి. అది నలిగి, నలువైపుల అణిగి, గుండ్రఁగా వుంది. పర్సు తెరిస్తేనే అది చదరంగా ఉందని తెలుస్తుంది. రెండు రూపాయిల నోటు వెలుపలికి, లాగి, కొడుక్కు ఇచ్చాడు.

'పాయసం చెయ్యమంటున్నాఁవటాని జెప్పరా మీ యమ్మకీ!'

'పరే! అట్లాగే!'

'అల్లాటప్పాగుంటే ఊల్లేదని జెప్పు! ఫస్టుకలాస్‌గా వుండాలి. మాంచి ఆకలితో రెపరెపలాడతా వస్తానాఁవటాని జెప్పు!'

చిన్నరాంకోటి రెండు రూపాయల కాగితం పేంట్‌జాబులో పెట్టుకొని లారీ ఎక్కాడు. డ్రైవర్ బీడి పీక అవతల గిరాటు వేసి, సీటెక్కాడు. లారీ బైలుదేరింది. లారీ వస్తున్నప్పుడు బాడీలో వెనుక నిలబడ్డ వాళ్ళిప్పుడు కూర్చున్నారు.

ఆ ప్రదేశం ఏభై ఎకరాల విస్తీర్ణం వుంటుంది. రైతులు అవతల ప్రక్కనుంచి ఎరువు జల్లల్లోకి ఎత్తుకొంటున్నారు. రెండెడ్లబళ్ళు, ఎడ్లు, జీతగాళ్ళు, పలుగులు, పారలు, జల్లలు, తట్టలు-అటువైపు హడావుడిగా

వుంది. కరకర ప్రొద్దెక్కుతూ వుంది, రాంకోటికి ఆకలి అయింది.

రాంకోటి పాకలోకి వచ్చాడు. మట్టిబాన ఒకటి మూలనుంది. దానిమీద మూకుడు దీసి, ముంతతో నిండా నీళ్లు తీసుకొని బానదగ్గర పెట్టుకొని, కొడుకు తెచ్చిన మూట విప్పి కొనలు సాపుచేసి, విస్తరి వంపులు తిన్నగా చేసుకొని చూశాడు. అంతా ఒకే ముద్దగా అతుక్కుపోయి ఉన్న పెరుగు కలిపిన చద్ది అన్నం, ప్రక్కనున్న నిమ్మకాయబద్ద నంజుకొంటూ తింటు న్నాడు.

ఎగువనుంచి ఎవరో వస్తున్న అలికిడి అయింది. తలెత్తి వెదురుబద్దల గోడలోంచి చూశాడు. ఎవరో రైతు ఎడంచేయి బొటనవ్రేలు తర్జనితో ముక్కు మూసుకొని, కుడిచెత్తో కట్టుపంచె ముంజెగులు ఎత్తిపట్టి, మునిగాళ్ళమీద ఎత్తిపట్టి, ఎత్తిపట్టి అడుగులువేస్తూ వస్తున్నాడు రైతు.

చద్ది తినటం ముగించి, గుడ్డ బైట విదిలించి, ఎంగిలి విస్తరాకు తీసుకుపోయి, గుంటలో పడేసి, ముంతలో నీళ్ళు చేతిమీద పోసుకొని కడుక్కొని, మూతి తుడుచుకొని, బన్నీనితో అద్దుకొని చెవిలోఉన్న చుట్ట తీసి ముట్టించుకొని పొగ వదులుతూ రైతువైపు చూశాడు.

'ఏం జేత్తన్నా?'

'ఏదీ-ఇది గిప్పుడే నద్దినీ....'

'ఇక్కడేందీ, అటన్నా బోయి దినకపోయా!'

రాంకోటి రైతు ముఖంలోకి నిరుత్తరంగా రెణ్ణిమిషాలు చూచి 'ఏందొరా! ఏంది చెప్పు!'

'ఎరువు దోలుకుపోతా, జీతగాళ్లొచ్చారు. బళ్లాడిడిచేరు.'

'కాగితం తెచ్చా!'

'ఆఁ!'

రైతు జేబులోంచి కాగితం ఇచ్చాడు. తీసి చూచుకొని 'ఎన్నిబళ్ళు?'

'ఆర్లే! మూడిప్పుడు దోలుకుపోతా, మళ్ళీ రేపొద్దున్నే మూడు!'

'అట్లాగే!'

కాగితం బన్నీను జేబులో పెట్టుకొన్నాడు రాంకోటి ఇద్దరూ ఎగువకు పోసాగారు. ముందు రైతు వెనుక రాంకోటి. వాళ్ళిద్దరికీ ఎప్పుడూ పది గజాల దూరం? రాంకోటి రైతును కలుసుకోవాలని ఎంత తొందరగా నడిస్తే అంత తొందరగా రైతు ముందుకు వెళుతున్నాడు. రాంకోటి కలుసుకోనూ లేదు. రైతు కలిసే అవకాశం ఇవ్వనూ లేదు. ఇద్దరూ ఎగువకు వచ్చాక రాంకోటి అన్నాడు.

'బాగా పొద్దిక్కిందియాల. పెందలాడే బళ్ళు కట్టించుకు రాలేక పోయావా దొరా!'

'ఏదిరా ఈలేదీ? బళ్ళు బాడిక్కి దొరకటం ఎంత కష్టం ఏందీ'?

మిగతా రైతులు జీతగాళ్ళతో ఎరువు ఎత్తించుకొంటున్న తావుకు ఇద్దరూ చేరారు. ఇక్కడే ఎత్తుకోండి అన్నట్లుగా 'ఈడే!' అన్నాడు రాంకోటి. జీతగాళ్లు అక్కడికి వచ్చారు. ఎరువు ఎత్తుకోవటం మొదలయింది. రాంకోటి బండిమీదున్న జల్లలు చూచి—

'దొరా!'

రైతు తలెత్తి చూశాడు.

'ఏణ్ణుంచి దెచ్చా ఈ జల్లలు? ఈ ఎరువు దోలుకు పోటానికే ఇంత పెద్ద జల్లలు మేదరోడికాడ జేయించావేంది? ఇంత పెద్దజల్లలు!'

'అబ్బే! అదేంలేదు రాంకోటీ! ఇయ్యి మావూలు జల్లలే! అబ్బే! ఏం పెద్దియ్యి!'

'ఏందోలే దొరా! కానీయండి!'

పోయినేడు లారీలు తోలిందీఏటికి ఎరువయింది. ఇప్పుడు తోలేది వచ్చేఏటికి ఎరువు! ఇప్పుడు పనికిరాని అసహ్యం వచ్చేఏటికి పనికివచ్చే ఎరువు!

ఆ ఎరువుపై మొలిచిన గరిక పరకలు కొరుక్కుతింటూ వుందొక ఎద్దు! దూరదూరంగా కట్టేసిన ఎడ్లు కొన్ని పడుకొన్నాయి. కొన్ని నిలబడే ఉన్నాయి. కొన్ని నెమరువేస్తున్నాయి. తోకతో ఈగలు తోలుకొంటూ మొలకలు తింటున్న ఎద్దును చూచి, 'ఏం దొరా! ఈ ఎద్దుకి గడ్డేయటం లేదేంది?'

'ఎందుకేయంరా అదో కరువుబోద్ది! ఏడ నాలుగు పరకలు గనబడ్డా ఎగబడుద్ది!'

మొత్తం నలభై బళ్ళున్నాయి. ఎరువు బళ్ళలోకి ఎత్తుకొంటున్నారు. వచ్చే బళ్ల వస్తున్నాయి. పోయేవి పోతున్నాయి. పోలుగర్ర ఎత్తి, కాడి క్రిందికి ఎడ్లులాగి, మెడకు పట్టెళ్ళు తగిలించి చిరతలు దిగేసి, జీతగా ళ్ళెక్కిన బళ్ళు బైలుదేరటానికి సిద్ధంగా అయిదున్నాయి.

'ఈ అయిదెవురియ్యి?' రాంకోటి అడిగాడు.

'నాయేరా?'

'మీకు నాలుగే గందా! అయిదేంది?'

రైతు నసిగాడు. 'ఏందో లేరా! పోనీయ్! జీతగాళ్ళకు తెలియదు.'

రాంకోటి నవ్వాడు. నిజంగా జీతగాళ్లకు ఏం తెలుస్తుంది. రైతుకే తెలియాలి. ఆయనెన్ని బళ్ళు అంటే అన్నే తోలుకుపోతారు వాళ్ళు. వాళ్ళ తప్పేం వుంది?

'తీరా ఎరువెక్కించిన జల్లలు కుమ్మరిచ్చమంటే ఏన్నేయంగా వుంటది గానీ ఆ డబ్బేందో ఈడ దగలేసిపోతే పోద్ది!'

రాంకోటి నిర్మొహమాటంగా అంటుంటే ఏం అనలేక రైతు జేబులోంచి డబ్బు తీసి ఇస్తూ 'అంతా లేదురా ఇదిగిదే వుంది. ఉంచు! మళ్ళీ ఇత్తాలే!

రాంకోటి నవ్వాడు. 'పోయినేడూ ఇంతేగా దొరా! మళ్ళీ ఇచ్చా? ఎందుకొచ్చిందీగానీ, ఎల్లండి.'

రైతు బళ్లతోపాటు వెళ్లిపోయాడు.

వరినారు మళ్ళలో అప్పుడే బెత్తెడెత్తు పెరిగింది. వానలు పడేలోగా చేలల్లో ఎరువు తోలాలి. కాలువలు వచ్చాక నీళ్లు పెట్టుకొని పొలం పదను చేయాలి. వారంరోజుల్లో పెద్ద కాలువ వదులుతారని వినికిడి. రైతులు ఎరువు తోలుకుపోతున్నారు. తొలకరికి ముందే తంతంతా ముగిసిపోవాలి.

రాంకోటి పాకముందు కుందుగూర్చున్నాడు. చుట్టచివరికంటా కాలుకొచ్చింది. పెదాలమధ్యనుంచి చుట్టతీసి పాకకు దూరంగా పారేసి, కాండ్రించి ఉమ్మివేసి చతికిలబడ్డాడు. లారీలు వస్తున్నాయి వెళుతున్నాయి. చిన్నరాంకోటి మళ్ళీ ఒకసారి లారీతో రావాలి. వాడితల్లి ఇంటికి వచ్చిందో రాలేదో పాయసం సంగతి చెప్పాడో లేదో ఆలోచించికొంటున్నాడు రాంకోటి.

ఏడాది క్రితం నాగరక నగరం, అనాగరకంగా తరిమిన లారీలు, ఇక్కడికి వచ్చి, ఇంతలోనే నాగరిక నగరానికి నాగరకంగా పనికివచ్చే ఎరువు తయారు చేశాయి. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ వుందో లేదో తెలియదుగానీ, సూర్యుడు చుట్టూ మాత్రం తిరగటం లేదు. కడుపు చుట్టూ తిరుగుతూ వుంది.

పండుగ రోజుల్లో ఇంటి నిండా రకరకాల వంటకాలు, భార్యా కోడలూ ఇద్దరూ అడుక్కు వస్తారు. 'ఆడే వుండు, ఈడకు రాబాక! ఏందీ మరీ దగ్గర కొత్తా. బావి దగ్గరకు రాకే మొద్దు! చెప్పేది నీకే! వినబట్టంలా?' అంటూ

అలా ఎదురుతిరిగినవాళ్లు పెద్దవాళ్లిద్దరు. వ్యవస్థలో అలా జరక్కుండా వుంటానికి ఎన్నో కట్టుదిట్టాలున్నాయి. వాటిలో తెగద్రెంపులు చేసుకొని వెలుపలికి రాగలవాళ్లు కొద్ది మంది! ఆ కొద్దిమందిలో కొడుకులిద్దరు. పెద్దవాడు రంగన్న తాలూకాఫీసులో కాపీయిష్టు! రెండోవాడు చింతయ్య కలెక్టరాఫీసులో యల్.డి.సి. వాళ్లకు పెద్దజీతాలు ఏమీరావు. బ్రతుకుదెరువు కటకటలాడుతూ వుంటుంది.

నగరంలో లారీ వచ్చింది. హారన్ వినిపించింది. రాంకోటి లేచి ముందుకు వచ్చాడు. ప్రొద్దు రెండు బార లెక్కింది. జూన్ నెల ఎండ ఉదయమే తీవ్రంగా వుంది. లారీకి చోటు చూపించి మట్టి గుట్ట మీద నిలుచున్నాడు. లారీతో వచ్చిన ఎవరో హడావుడిగా గుట్ట ఎక్కుతుంటే, 'ఇదుగో ఆ తొందరే వద్దన్నా!' అన్నాడు.

'ఏం?'

'అవసలే పోతమట్టి. జవుకిస్తుంది. ఏం దా దూకుడు? ఆగు! ఆగాగు కాలుజారి బిళ్లబీటుగా అందులోబడి కూరుకుపోయేవ్!'

ఎదుటి మనిషి ఆగిపోయాడు. అందరూ చెప్పిన మాట వినరు. పిల్లలిద్దరూ అంతే! కొందరు చెప్పుడు మాటలు వింటారు. చెడిపోతారు.

లారీ వెళిపోయింది.

హాయిగా తాతముత్తాతలు తరతరాలనుంచి చేసినపని ఎందుకుచేజేతులా వదులుకొంటారు అని అందరూ చెప్పినా ఆలించలేదు రంగన్న చింతయ్య. వాళ్లంటే కోపమే!

తల్లీదండ్రుల్ని మించిన దేవతలూ దేవుళ్ళూ లేరు. మీ నాన్నను కని పెట్టుకుండు బాగుపడి పోతావంటే ఆ మాటలు విని చెడిపోయిన రాముడు-చిన్నరాంకోటి-అన్నా దిగులే!

రంగన్న ఎప్పుడూ ఎందుకో బాధపడుతూ వుంటాడు. ఏదో పోగొట్టు

తాము చేసుకొన్నవి కలవాళ్ళ పెడితే వాళ్ళ బుట్టలో వేయించుకొని, నెత్తినో చంకనో బెట్టుకురావటం చూస్తే వాళ్ళ తారు డబ్బావైపు వెళుతున్నారో, ఇంటికి వెళుతున్నారో తెలియని వాళ్ళ పోల్చుకోలేరు.

ఎందుకో రాంకోటి పై పెదవి చివరి అంచుల్లో ఉన్న తెల్లవెంట్రుకల గుంపు క్రిందికి వాలి వున్నవి కొంచెంగా పైకి కదిలేట్టు నవ్వాడు. ఆ నవ్వులో ఆడుకొంటూ పడి దుమ్ము కొట్టుకుపోయిన పిల్లవాడు లేచి నిలబడుతుంటే చూచి నవ్వే తల్లి తీరు కనిపిస్తుంది. పట్టణంవైపు చూశాడు. లారీ ఒకటి మలుపు తిరిగి వస్తూవుంది.

కొడుకు లిద్దరూ గుర్తుకు వచ్చారు. కులవృత్తి మానవద్దని అందరూ చెప్పారు పూర్వం. ఇప్పుడు మానతాం అంటూ అందరూ ఎదురు తిరుగుతున్నారు. ఏ విషయం ఎక్కువగా ప్రస్తావింపబడుతుందో ఆ విషయంమీద అనుమానం ఎక్కువవటం, లోకంలో సహజమే!

చెప్పులు కుట్టేవాడి కొడుకు చెప్పులు కుట్టననటం, చాపలల్లేవాడి కొడుకు అందుకు తిరస్కరించటం, గీసేవాడి కొడుకు ఎదురుతిరగటం, ఈ రోజుల్లో రివాజు అయిపోయింది. కులవృత్తిలో వచ్చే సంపాదనకంటే—రాబడికంటే ఎదురుతిరిగినవాళ్లు వేరే వృత్తిలో ఎక్కువ ఆర్జింపలేకపోవచ్చు. అయినా ఎదురుతిరుగుతారు.

ఈ ఎదురుతిరగటం ఎవడికీ ఎవడూ నేర్పలేదు. అంటే ఏ ఒక్కడూ మరే ఒక్కడికీ బోధింపలేదు. ఈ శతాబ్ది జాతి జీవితంలో వచ్చిన మార్పే అది. ఎక్కడెక్కడో వచ్చిన పరిణామాలు ఇక్కడ నాటుకుపోయి మొలకెత్తేయి.

తాను చేసేపని తప్పని ఎవరయినా అంటే తక్షణం మానుకొంటాడు మంచి మనిషి. తాను చేసేపని ఎగతాళి చేయబడితే, నిందింపబడితే, తిరస్కరింపబడితే, సమర్థుడయితే మనిషి ఎదురు తిరుగుతాడు. అసమర్థుడయితే తల వంచుకుపోతాడు.

కొన్న వాడిలాగా దిగాలుపడి వుంటాడు. దేన్నీ సహింపలేడు. ఎవడయినా ఏడుస్తుంటే వూరుకోలేడు. నవ్వుతున్నా చూడలేడు. పెద్దవాడి' మనస్తత్వం బోధపడక బాధపడ్డాడు రాంకోటి, కొడుకును చూద్దామని వచ్చిన మొదటి రోజే!

వాడిదొక అద్దె యిల్లు! నెలకు ఏడు రూపాయలు. తాటాకుల పాక! నలుగురు పిల్లలు. పెళ్ళాం ముక్కుతూ మూలుగుతూ చీదుతూ వుంటుందెప్పుడూ! కోడలు వరసేం నచ్చలేదు రాంకోటికి.

ఆ పెద్ద తాటాకుల పాకలో ఎనిమిది భాగాలు, ఎనిమిది సంసారాలు. అంతా వెరసి ఆ యింటిలో ఏభైమందైనా వుంటారు. ఇంత ఇంటికి ఒక్కటే లేవెట్రి!

రెండో రోజు ఉదయం పాకీమనిషి వచ్చేసరికి ఏభైమంది కంయ్యిమని లేచారు. ఆమె రెండు రోజుల్నుంచి రాలేదుట. భర్తకు పిల్లలకు ఆరోగ్యం ఎత్తా దించుల్లో వుందిట. ఆమె గోడు ఎవరు ఆలించటం లేదు. రాంకోటి, రంగన్న అయినా ఏమన్నా మాట్లాడతాడేమోనని ఎదురు చూశాడు. చుక్కెదురయింది.

పాకీ అంటే పవిత్రం అనే అర్థం వుందని చదువుకొన్న వాళ్ళెవళ్ళో చెబితే విన్నాడు రాంకోటి ఎప్పుడో! పాకీదొడ్డి అంటే మనిషి పావిత్ర్యం పొందే తావు అన్న మాటనూ నమ్మాడు. అయితే పాకీమనిషి అవస్థ చూచింతర్వాత పవిత్రతకు అర్థం లేదనిపించింది.

ఓర్పు అలవాటు చేసుకొన్న మనిషి ఎంత కష్టం అయినా నవ్వుతూ సహింపవచ్చు, భరించవచ్చు. రాంకోటి కెప్పుడూ తను బాధపడుతున్నట్లు ఆలోచన కలగలేదు. అయితే ఆ రోజు ఆమె దుస్థితి చూచి, కష్టం చూచి బాధ పడ్డాడు.

బాచీపట్టు వేసుకొని అన్నం ముందు కూర్చున్నప్పుడు, రాంకోటి కొడుకు నడిగాడు.

'ఏందిరా నువ్వన్నా ఆగండాగండి, ఏం దీ గోలాఁవటాని అడ్డుబళ్లే దేం పొద్దుని.'

'ఏంది? ఏందది?'

'పాకీమనిషి రాలేదంట్రా పొద్దుని. అందరూ కంయ్ కుంయ్‌మని ఎగిర్రే! అదే పొద్దున్నే!'

'మన కెందుకా రొంపి!?'

'అదేందిరా! నువ్వన్నా కలగజేసుకోకపోతే ఆ దిక్కుమాలిందెంతేడిసి పొయ్యిందిరా!'

'ఆఁ! ఇట్టాటియన్నీ బట్టించుకొంటే నేనీడ మిణికినట్టే! గుట్టు కాస్తే రట్టవుద్ది.'

'ఏందీ! గుట్టేందీ, అది కాంతీ రట్టవటఁవేందీ? ఏందిరా నువ్వనేది నా కర్థం గాటల్లే చెప్పు!'

'పెద్దగా అరవమాక! నేనెవుర్నో ఈడెవుడికీ తెలియదు'

'ఏందీ?' రాంకోటి ఆశ్చర్యపోయాడు.

'తెలిస్తే ఇంకేఁవయినా వుందీ! బాయిలో నీళ్లు కూడా తోడుకో నియ్యరు, పలకరించే దిక్కు సంగతి పక్కన బెట్టు'

'ఎట్టెట్టా? నువ్వెవుడువో తెలినీకుండా ఎట్టా గడుసుద్దిరా ఈడ?'

'ఈ డింతేలే! నువ్ గానీయ్'

భోజనం పూర్తయింది. ఆ సాయంకాలం నుంచి తలనొప్పి పట్టుకొంది. ఎడాపెడా వాయించింది. అర్థరాత్రి నుంచి జ్వరం తగిలింది. తెల్లవారే సరికి బాగా భారకంగా వుంది.

'ఏం దిది' అన్నాడు రంగన్న ప్రొద్దున్నే.

'ఏందో లేరా అదే బోద్ది!'

రంగన్న తండ్రిని హాస్పిటల్‌కు తీసుకుపోయాడు. పెద్ద డాక్టరుకు చూపించాడు. ఇంజక్షన్లు ఇప్పించాడు. మాత్రలు తెచ్చాడు: మందు తెచ్చాడు. మరుసటి రోజుకు జ్వరం లేదు. తలనొప్పి లేదు.

'రాంకోటి!' ఎదురుగా వున్న రైతు పిలిచాడు.

'ఏం దొరా!'

'నేనేడు బళ్ళు దోలుకుపోతున్నా!'

'అట్టాగే దొరా!'

రైతు రెండెడ్ల బళ్ళ వైపుగా నడుస్తున్నాడు. రాంకోటి లేచి వెంట నడిచాడు.

'ఈ సాయిగా రా దొరా! రాయీ రప్పా గుచ్చుకొనేనూ!' బళ్ళ దగ్గరకు చేరుకొన్నారు.

'ఏడు బళ్ళు పూర్తయినట్టేనా మీయి?'

'ఆఁ!'

రాంకోటి, ఒక బండిచక్రంమీద కాలుబెట్టి ఒసికర్ర పుచ్చుకొని పైకి ఎక్కి జల్లలో చెయిపెట్టి చూచి దిగివచ్చాడు.

బండికి కట్టిన ఎద్దులు నడవసాగాయి. 'చొచ్చోచో నీ ఎద్దుగాల!' అన్నాడు జీతగాడు. బండి ఆగింది.

'ఏం దొరా! తొక్కితొక్కి ఎక్కించినట్టుండారే ఎరువు!'

'ఏందో లేరా!'

'పొద్దెక్కుద్ది పొండి!'

బళ్లు లాక్కుపోతున్నాయి ఎద్లు!

అప్పుడే రెండు రెండెడ్లబళ్ళు వచ్చాయి. గిత్తలు మంచి వూపులో ఉన్నాయి. చెంగనాలు తీస్తూవచ్చాయి. ఒకబండిమీద జీతగాడు మరో బండిమీద రైతు ఎవరిదగ్గరా చెర్నాకోలలేదు. వంటిమీద చేయివేస్తే ఆగమేఘాలమీద ఎగిరిపోయేట్టున్నాయి గిత్తలు. ఈగ వాలితే జారిపోయేంత నున్నగా వున్నాయి వాటి వీపులు, మూపులు. వాళ్ళదగ్గర కాగితం తీసుకొని బన్నీను జేబులో వేసుకొని, అవి మోసుకుపోగలిగినంత వేసుకుపొండి అనుకొని చుట్ట చుట్టుకొంటూ పాకదగ్గరకు వచ్చాడు. ఇంకా చిన్నరాంకోటి ఉన్న లారీ రాలేదు.

తాటాకు పాక మొగదల రాతిబండమీద కూర్చుని కాళ్ళు నేలమీద తాటిస్తూ చుట్టముట్టించుకొని పొగలు వదులుతూ వున్నాడు రాంకోటి. పెదిమలు పొగ పీల్చటంతో లోపలికి పోతే ప్రక్కగా పైనున్న మీసాలు క్రిందచూపులు మాని నిక్కబొడుచుకొని, పొగవదిలేటప్పుడు యథాప్రకారం క్రిందికి చూపులు మరల్చుకొంటున్నాయి. కుతిదీరా చుట్ట కాల్చుకుంటుంటే పాయసం గుర్తుకు వచ్చింది.

నిలవ నీడలేని మనిషి తాటాకు పాకవుంటే చాలను కొంటాడు. పాక వున్నవాడు పూరికొంపవుంటే బాగుంటుదనుకొంటాడు. అది వుంటే మిద్దె, మిద్దె వుంటే మేడ, మేడవుంటే బంగాళా. ఇలా ఒక దానికంటే మరొకటి గొప్పగా వుండాలని మానవుడి ఆశ! ప్రయత్నం! ఈ ప్రయత్నంనుంచి జీవితానికి నిర్వచనం పుడుతుంది. రాంకోటికి చుట్టలేకపోతే చుట్టకోసం ప్రయత్నం చేసేవాడు. చుట్టవుంది గనుక పాయసం మీదికి మనస్సు మళ్ళింది.

భార్య ఇంటిదగ్గర ఈ పాటికి పాయసంచేసే ప్రయత్నంలో ఉంటుం దనుకోవటంలో అతని ఆనందం మీసాల మీదుగా ప్రాకిపోయింది. పోగానే తాగాలి అనే కోర్కె ఎక్కడ పుట్టిందో కాని కడుపులో ఆకలి పుట్టింది.

మునుపొకసారి ఆశతో పాయసం చేయించుకొని, ఆవురావురు మంటూ

ఎవరికీ ఏమి మిగల్చకుండా అటికెడు తానొక్కడే జుర్రుకొన్నాడు. అయితే హాయిగానే వుందిగానీ ఆ తర్వాత అజీర్ణం చేసింది. రెండు రోజులు విపరీతంగా కడుపునొప్పి! ఉమ్మలు చుట్టుకు పోయాడు!

ప్రయివేటు డాక్టరు దగ్గరకు పోయాడు. హాలులో రోగులు కూర్చున్నారు. వరండాలో రోగులున్నారు. ఇంటిముందు రోగులున్నారు.

అన్నంలేని రోగం, అన్నం అరగని రోగం! అంతకంటే రోగా లేమున్నాయి లోకంలో. ఏభై ఏళ్లు నన్ను కాపాడితే,మిగతా ఏభై ఏళ్లు నిన్ను కాపాడుతానందట అదేదో దేశంలో, కడుపు, మనిషితో.

రాంకోటి హాలులోకి పోలేదు. కాంపౌండుగేటుకూడా ఎక్కలేదు. ఇవతల నిలబడివున్నాడు. రోగులంతా వెళిపోయింతర్వాత డాక్టరు తనను పరీక్షిస్తాడని ఆశించాడు. అనుకొన్నట్లుగా రోగులంతా వెళిపోయారు. డాక్టరు రాంకోటిని చూశాడు. గుర్తించాడు. లోపలికి రమ్మనలేదు. తాను వెలుపలికి రాలేదు. కాంపౌండరును పంపించాడు. అతనే రాంకోటి పాలిటి డాక్టరు! అయితేనేం రెండోరోజుకు కడుపునొప్పి తగ్గిపోయింది.

ఒక వారంరోజులు తర్వాత, ఆ డాక్టరు రోగిగా పెద్దాసుపత్రిలో చేరాడు. చిన్నపేగు మెలిపడటంతో ఆపరేషన్ ఏదో అవసరమయిందని కాంపౌండర్లు చెప్పుకొంటున్నారు. డాక్టర్లు ముగ్గురు నలుగురు చుట్టూ మూగారు. నలుగురు ముగ్గురు నర్సులు ప్రక్కనున్నారు.

రోజు సాయంకాలం నగరం నడిబొడ్డు మీద మెడపైకెత్తి నిలబడ్డ కళామందిరంలో కవులు కవిత్వం చదువుతున్నారు. రాగ తాళమయంగా నవ రసభరితంగా చదువుతున్నారు. పాటకజనుల బాధలగూర్చి.

'ప్రపంచం అంతా భవ్యంగా వుంది. స్వర్గంలో దేవుడున్నాడు'

ఒక కవి చదివిన ఆ అర్థం వచ్చే పద్యానికి పోటీగా సంగీతాత్మకంగా మరోకవి మునుం పెట్టాడు.

ప్రపంచం అంతా సవ్యంగా లేదు. స్వర్గంలో దేవుడు లేడు.'

లౌడ్ స్పీకర్‌లోంచి వినబడుతున్న కవిత్వం రోడ్డు మీద చెట్టు క్రింద నిలబడి వింటున్న ఒక వ్యక్తి (కవి అయివుంటాడు. అక్కడికి-కవిత్వం చదివేందుకు-ఆహ్వానం వచ్చి వుండదు) అంటూ పోతున్నాడు ప్రక్క వ్యక్తితో.

'అన్నీ ఎంగిలి కూతలు! ఎంగిలి తిళ్ళు! వాంతులూ బేదులు! అంతా అజీర్ణరోగం! లోకం నిండా అజీర్ణం! రోగం రొచ్చు రొండి! కవిత్వంనిండా గబ్బు! కళామందిరంలో కంపు! ఛీఛీ దుర్గంధం'

లారీ వచ్చి ఆగింది. గుంట దగ్గరకు వచ్చింది. గుంట దాదాపు నిండి పోయింది. ఇంకొక్క లారీ మాత్రమే రావాలి: అందులో చిన్న రాంకోటి వస్తాడు.

రాంకోటి లేచాడు. ఉంగటాలు తెగిపోయిన చెప్పులు కాళ్ళకు వేసుకోబోతూ చూశాడు. రెండూ పాదాల క్రింద అరిగిపోయాయి. అప్పటికే అవి అతుకులు పడ్డాయి. జవజవలాడుతున్నాయి. కాళ్ళకు తొడుక్కొని లారీ దగ్గరకు పోయాడు.

'నా కొడుకెగిరిపోయేవోడే!' లారీ డ్రైవర్ చెప్పాడు.

'ఎవుడాడు?' రాంకోటి అడిగాడు.

'ఎవుడో కుర్ర సన్నాసి! చేతు లొదిలేసి సైకిల్ తొక్కుతున్నాడు గందా! ఆడొత్తన్నాడని నేనేమన్నాజూసేనా, పెట్టేనా మలుపుదిరిగేసరికి కంట బడ్డాడు. లారీ సడన్ బ్రేక్ ఏసేసరికి సైకిల్ పప్పుపప్పు అయ్యిందీ ఆ దెగిరి మురుక్కాలవలో పడ్డాడు. నాయాలు! ఎమికలన్నీ సరిగ్గా వుండయ్‌లే!'

'ఆర్పాపం!'

'అందుకే గందా ఆలస్యెమయింది. ఏం పర్లేదులే! ఆడుబాగుండాడు

బురద గొట్టుకొని పందిపిల్లలే!'

'పోన్లే!'

లారీ వెళిపోయింది.

చింతయ్య గూడా అంతే! చేతులు వదిలి సైకిల్ తొక్కుతాడు. వత్తి దుడుకు పిండం. ఏ క్షణాన ఏం తెచ్చుకొంటాడోనని రాంకోటికి ఎప్పుడు రెండోవాడంటే చెప్పలేని భయం.

చింతయ్య బొత్తిగా లెక్కా జమాలేని మనిషి. తూలుతూ ప్రేలుతూ వుండే బాపతు. ఏనాటికయినా డిప్టీకలెక్టరు అయితీరుతానంటాడు. తను వ్రాసిన కాగితాలమీదతప్ప కలెక్టరు కళ్లుమూసుకొని సంతకం పెట్టడట. రాంకోటి చింతయ్య దగ్గరకు పోయినప్పుడు ఏమేమో చెప్పాడు. ఏ జీవో అయినా గడగడా, ఎండాకాలం చల్లని మంచి నీళ్లు తాగినట్లు చెప్పేయగలడట. మరదేమన్నా గొప్పో ఏమిటో! చింతయ్య పేంట్‌లోకి చొక్కా దిగేసుకొని చెప్పులేసుకొని రోడ్డు మీద వెళుతుంటే చూడాలి. అచ్చంగా దొరబిడ్డ వుండ ట్టుంటాడంటే నమ్మితీరాల్సిందే! తండ్రి ఆలోచనలు ఎప్పుడూ కొడుకుల్ని గూర్చి గొప్పగానే వుంటాయి.

చింతయ్యకు పిల్లాజెల్లాలేరు. చీకూ చింతాలేని మనిషి! పెళ్ళాం తల్లో నాలుక! చెప్పినట్లు వింటుంది. చేయమన్నట్లు చేస్తుంది. ఇద్దరూ సాయంత్రం షికారుకంటూ బైలుదేరుతారు. జీతం కంటే పైరాబడి ఎక్కువగా వుంటుం దట. ఆమె కవీ ఇవీ కొనిపెడుతుంటాడు. వాళ్ళిద్దరినీ చూస్తుంటే రాంకోటికి చాలా ముచ్చట కలిగింది,

రెండో రోజు ఉదయం ఎవరో ఆడమనిషివచ్చి నీళ్ళు తోడి కుండల నిండా పోసింది. వంటగదిలోకి వచ్చి పాత్రలు తీసుకుపోయి కచికతో తోమి, శుభ్రంగా కడిగి యింట్లోకి తెచ్చింది. అన్నం పెట్టించుకొని వెనుక తట్టు వరండాలో కూర్చుని తిని లేచి వెళిపోయింది.

రాంకోటి ఉదయం ఆమెను చూశాడు. పాకీ పని చేసే మనిషి! ఆమె

యింట్లోకి రావటం గూర్చి అర్థం కాలేదు. మూడు గదులు! ముప్పయి రూపాయిలు అద్దె! ఇంట్లో రెండు మంచాలు పరుపులు! కూర్చునేందుకు కుర్చీలు! చింతయ్య పని మంచి వాటంగా వుంది.

ఆ రోజు సాయంకాలం చింతయ్య తండ్రినీ, భార్యనీ సినీమాకు తీసుకుపోయాడు. ముగ్గురూ కుర్చీలో కూర్చున్నారు. రాంకోటికి సినీమా చాల వింతగా వుంది. అంతకంటే వింతగా తన కడుపున పుట్టిన కొడుకున్నాడు. కుర్చీలో కూర్చుంటే హంసతూలికాతల్పం మీద శయనించినంత ఆనందం కలిగింది. ఏది అనుభవించటానికి అయినా ఆ రాత వుండాలనుకొన్నాడు. రాత్రి యింటికి తిరిగి వచ్చేటప్పుడు అడిగాడు.

'ఏందిరా, పొద్దుని ఆ మనిషి ఇంట్లోకి వొచ్చి కుండలూ పట్లులూ లొడపెడతావుందీ?'

చింతయ్యకు ఆ మనిషి గుర్తుకొచ్చింది.

'ఏం ఏం తప్పుందీ?'

'అది గాదురా! అదేం బాగుంటదీ ఎవురన్నా నిన్నేమన్నా అనుకొంటే ఎట్టా?'

'అంటే ఏందీ నువ్వనేది?'

'ఆ మనిషి నీ యింటో దిరుగుతుంటే-ఏందీ-ఎవురన్నా ఈడు పలానోడు గాంవోలు అనుకుంటే ఎట్టాగా అంట?'

'అందరికి తెలుసులే!'

'ఏందీ?'

'అవును-నాకేందే భయం!'

'ఆళ్లంతా నిన్ను సులకనగా జూత్తే!'

'అసలు ఎవడీళ్లందర్నీ లెక్కజేసేది? ఎదవనాయాళ్లు. ఒకడెవడో ఏందో అనుకొంటాడని పుటక దాచుకోటానికి నేనేమన్నా అడ్డదిడ్డంగా పుట్టినోణ్ణా, ఏంటి–అట్టా వ్యవహారాలు నేనుగాదు ఉడకనిచ్చేది.'

చింతయ్య తెలియకుండా పెద్ద కొడుకును తిడుతున్నట్లు అనిపించింది రాంకోటికి. వారం రోజులుండి భార్యమీద గాలి మళ్లీ బైలుదేరాడు. ఈ పక్షం రోజుల్లో ఇద్దరు కొడుకుల్ని బాగా అర్థం చేసుకొన్నాడు రాంకోటి. ఇద్దరి మీద ప్రేమ వుంది. ఇద్దరి మీద కోపం వుంది. ఇద్దరి కుటుంబాలు నచ్చాయి. ఏదో ఒక కారణంవల్ల ఇద్దరిమీదా బాధ కలిగింది.

ఊరెళదామని బైలుదేరేరోజే ఉదయం కడుపులో నొప్పిగా వుంది. అయినా లెక్కచేయకుండా, పప్పులు కావాలన్న పిల్లవాడికి పప్పులు పెట్టిందాకా మారం చేసినట్లు, వెళ్ళాలంటే వెళ్ళాలని పట్టుబట్టుక్కూర్చుంటే ఏమీ చేయలేక చింతయ్య తండ్రిని రైలెక్కించాడు.

రైలు బైలుదేరేటప్పుడు ఆ పెట్టెలో జనంలేదు. ఒక మూల దుప్పటి పరిచి పడుకొన్నాడు రాంకోటి. నాలుగు స్టేషన్లు దాటీ దాటకముందే రైలు నిండా మనుష్యులైపోయారు. వీళ్ళంతా ఎక్కడికి పోతారో, ఇంతతొందరేమిటో అర్థం కాలేదు. అర్థరాత్రికి కడుపునొప్పి చాలా ఎక్కువయిపోయింది.

చాలాసార్లు లేవెట్రీలోకి పోయి వచ్చాడు. శక్తి సన్నగిల్లిపోజొచ్చింది. విరేచనాలు అధికంగా అవుతున్నాయి. ఉన్నట్టుండి వాంతులు ప్రారంభమయ్యాయి. తెల్లవారింతర్వాత పది గంటలు అయితేగానీ తన వూరు చేరుకోలేదు. ఓపిక సన్నగిలిపోయింది. డీలా పడిపోయాడు

మనిషికి అపరిమిత ఆనందం కలిగితే, ఆ ఛాయలో భయం తొంగి చూచే అవకాశం వుంది. అంతా దుఃఖం అయితే మనిషి మొండికెత్తి కూర్చుంటాడు. కాదంటే క్రుంగిపోతాడు ఆ క్షణంలో రాంకోటి క్రుంగిపోయాడు. పక్షంరోజులు కొడుకులిద్దరి దగ్గర తను గడిపిన జీవితం ఆనందమయిందే! భార్యను చూడాలని ఆ క్షణంలో ఒక కోరిక అకస్మికంగా.

కలిగింది. వెంటనే భయం ఆవరించింది.

ఊరు చేరుకోకుండానే మధ్యలో తను చనిపోతే? ఆ అభిప్రాయం కలిగేసరికి రాంకోటి సంచలించి పోయాడు. ఊరు చేరిందాకా బ్రతికివుంటే, ఆ పైన చనిపోవని తేల్చుకొన్నాడు. కాని వూరు చేరటమే సాధ్యమయ్యేలా లేదు. కూర్చోలేకపోతున్నాడు. పడుకొంటే బాగుండేది. అయినా పడుకోనిచ్చే దెవరు? అందరూ కూర్చోవాలి! కూర్చునే హక్కు అందరికీ వుంది.

కడుపులో గుడబెడలాడుతుంటే లేవెట్రికి వెళ్ళి, తిరిగి వచ్చేటప్పుడు అక్కడ రద్దిరద్దిగా కూర్చున్న అందరినీ దాటుకొంటూ ఆ మూలకుపోయి కూర్చోవటం కష్టమనిపించి, వాకిలి దగ్గరగా క్రింద కూర్చున్నాడు.

ఎవరూ అతన్ని పట్టించుకోలేదు. చాలామంది అతని అవస్థ చూశారు కొందరు కూర్చునే కునికిపాట్లు పడుతున్నారు. తీరా తలెత్తిచూస్తే మునుపు తను పడుకొన్న బల్లంతా మనుష్యులతో నిండిపోయింది. అంతేకాదు, కూర్చున్న కాళీ కాస్తా నిండిపోయింది. రాంకోటి ఏమీ పట్టించుకోలేదు.

తెల్లవారుజాము అయింది. రైలు వేగంగానే వెళుతూ వుంది. అయినా ఆలస్యంగా వెళుతున్నట్లనిపించింది. ఉన్నట్టుండి వాంతి అయింది. నీళ్ల వాంతి! కడుపులో ఏమీలేదు. బిక్క చచ్చిపోయాడు రాంకోటి. ఏడుపు వస్తూంది. ఎవరూ పలకరించటంలేదు. దూరంగా తొలగిపోతున్నారు. మనిషి పెట్టెలోకి ఎక్కటానికి కాళీలేదని చెప్పగలవాళ్ళు నలుగురుకు తగినంత జాగా అతని కొక్కడికి వదిలిపెట్టారు.

ఆ పెట్టెలో లేవెట్రీ లేకపోతే ఎలా వుండేది? ప్రతి పెట్టెకొక లేవెట్రీ! లోకంనిండా జనం. జనం చుట్టూ అవసరాలు! ఇంటింటికీ వంటగది! దానికి దూరంగా మరో గది. దానికీ దీనికీ అంతసూత్రం మనిషి! ప్రతి మనిషికి హక్కులున్నాయి. హక్కులు లెక్కాపత్రం లేకుండా వాడుకొంటు న్నాడు మనిషి! హక్కులు అనుభవించి, బాధ్యతలు గమనించలేని మనుష్యులకు కూలీ రాంకోటి. కూలీవాడి బాగోగులు ఎవడికి పట్టాయి? అతని కష్టం చూచేదెవరు, జాలి తలచేదెవరు?

అతని తీరు చూస్తుంటే కలరా రోగి అనిపించింది అందరికి. జీవితం అంతా శృంగారమయం అనుకొనే వయస్సులో ఉన్న యువకుడు జీవితం నగ్నత భరింపలేకపోయాడు.

భార్యా ముగ్గురు పిల్లలతో రైలెక్కిన యువకు డింకొకడు తన బాధ్యతలు మరిచి పోకూడదనుకొంటున్నాడు. అతనివైపు ఆ యిద్దరూ చూడ లేదు. మూలన కూర్చుని కనుపించని ప్రకృతి రామణీయకం తిలకిస్తున్న యువతి ముక్కు మూసుకోవటం ముఖం చిట్లించటం గమనించిన యువకుడు ఆమెకీ రోగి ఇక్కడుండటం ఇష్టంలేదనే తేల్చుకొన్నాడు.

ఆ యువకులిద్దరూ రైలు ఆగిందాకా రాంకోటిని ఓర్చుకోదల్చు కొన్నారు. ఎక్కువమంది నిద్రలో ఉన్నారు. ఆరుగురేడుగురు కళ్లు నులుం కొంటున్నారు. ఇద్దరు యువకులు నిద్రమాట అవతల వుంచారు. వాళ్ళొ కళ్ళతో ఇంకొకళ్ళు ఏమీ మాట్లాడుకోలేదు గానీ, రైలు ఆగగానే ఇద్దరూ రాంకోటి దగ్గరకు వచ్చారు.

'దిగు!' అన్నారిద్దరూ. ఒకరి ముఖంలోకి మరొకరు చూశారు భావ సామీప్యంవల్ల.

'ఏంది?'

'దిగు దిగు!'

'ఏందిదీ నాదీవూరు గాందే!' రాంకోటి విచిత్రంగా చూశాడు. దిగే ఓపిక లేదనిపించింది.

'దిగు దిగు!'

'నాకు టిక్కెట్టుంది!'

'సర్సర్లే! దిగు దిగు!

రాంకోటిని చేరో చేయిపట్టుకొని ఇద్దరు యువకులు దించి ప్లాటుఫారం

మీద ఉన్న బెంచీ బల్లమీద పడుకోబెట్టారు. రైలెక్కారు. పెట్టెలో పడుకొన్న భార్యనీ పిల్లల్నీ చూచుకొని తృప్తిపడ్డాడొక యువకుడు. మూలనకూర్చున్న యువతి ముఖంలో నవ్వుకోసం-ఎడారిలో పువ్వుకోసంలాగా-వెతికి కనిపించక మూతి ముడుచుకొని ఎటోచూస్తు నిలబడ్డాడింకొక యువకుడు.

కపెర కపెర తెల్లవారింది. ఆ స్టేషన్ చాలా చిన్నది. ఆ సమయంలో వచ్చేరైలు పోయేరైలు ఏమీ లేవు. మనుష్యులే లేరు. స్టేషన్‌లో ఉన్న లేవెట్రీలోంచి చీపురుకట్టే. ఫినాయిల్ డబ్బాతో తిరిగివస్తున్న పాకీవాడు రాంకోటిని చూశాడు. ఎక్కడో నూతిలోంచి మాట్లాడినట్లు అతని గొంతు విన్నాడు. ఇంటికి ఎత్తుకుపోయాడు రాంకోటిని.

రోడ్డుమూలమీద మలుపు తిరుగుతూ లారీ కనిపించింది. హారన్ వినిపించింది. రాంకోటి లేచి చూశాడు. లారీ వస్తూవుంది. అందులో చిన్న రాంకోటి వస్తాడు. ఇంటిదగ్గర వాళ్ళమ్మతో పాయసం చేయమని చెప్పి వుంటాడు. ఈ పాటికి తయారవుతూ వుంటుంది. సూర్యుడు నడినెత్తిమీదికి వచ్చాడు. రైతులింకా ఎరువు జళ్ళల్లో పోసుకొంటున్నారు.

అటు చూస్తుంటే ఒక రెండెడ్లబండి వెళుతూవుంది. రాంకోటికి ఎందుకో అనుమానం వచ్చింది. 'ఇదుగో! ఎవురదీ: ఆపో! ఆపో బండిని! ఇదుగో నిన్నే' కేకలు పెట్టాడు. కేక అందేంతదూరంలోనే ఉన్నారు రైతులు. బండి ఆగలేదు. రైతులూ జీతగాళ్లూ రాంకోటివైపు చూశారు.

'చెప్పేది నీగ్గాదూ! ఆపమంటే ఏందావవు! ఆపో! ఆపో!' రాంకోటి ఆదరాబాదిరా కాళ్ళకు చెప్పులేసుకొన్నాడు. పడుతూ లేస్తున్నట్లు ముందుకు సాగాడు. గుంటమీదుగా దగ్గర, గబగబా వెళుతున్నాడు. గుంటప్రక్క ఎత్తుగా పోసిన ఎర్రకండ మట్టిమీదికి ఎక్కాడు. కుప్ప కవుకిడుస్తూవుంది. రాంకోటి క్రిందికి చూడటంలేదు, 'ఆపో! ఆపో!' అంటూ ఎడ్లబండివైపు చూస్తూన్నాడు.

రాంకోటి మట్టికుప్పమీద మలుపు తిరిగాడు. పెద్దమట్టి పెళ్ళకొకదానికి చెప్పుకొట్టుకుంది. అప్పుడు 'ఆపో!!' అంటున్నాడు రాంకోటి. ఉంగటం

తెగిన చెప్పు ఎదురు దెబ్బతో క్రిందికి వంగిపోయింది. మధ్య అరిగి కన్నం పడ్డచోటుకు మడతపడింది. 'ఆపో!' అంటున్నాడు రాంకోటి. కాలుతీసి కాలు వేయబోయేసరికి మట్టిపెళ్ల తావు దప్పింది. దొర్లింది. కాలు నిలవలేదు. పట్టు చిక్కలేదు. మట్టి కుప్పమీంచి తూలిపోయాడు. నీళ్ల బీటుగా పూర్తిగా నిండిపోయిన గుంటలో పడ్డాడు. పడుతున్నప్పుడు ప్రమాదం తెలిసివచ్చింది. 'ఆపో!' అనలేదు. 'దొరా!' అన్నాడు. 'దొరా!' పెద్దగా అరిచాడు. బోర్లా పడ్డాడు.

ఎదురొమ్ము ఆనింది. మోకాళ్లు ఆనాయి. కాళ్ళు గట్టునే ఉన్నాయి. గట్టును తన్నిపట్టి పైకి లేవాలని చూస్తే మరింత లోపలికి పోయాడుగానీ గట్టెక్కలేకపోయాడు. చేతులతో అదిమిపట్టి పైకి లేద్దామని ప్రయత్నించిన కొద్దీ చేతులు లోపలకు పోతున్నాయిగానీ వీలుచిక్కటంలేదు. ముఖం ఆనలేదు. మెడ పైకెత్తి వుంచాడు. బలంగా గింజుకొన్నా ఫలితం లేకపోయింది. 'దొరా! దొరా!! దొరా!!!' ముమ్మారు కేక పెట్టాడు. అది ఏ దొరకూ ప్రత్యేకంగా పిలుపుకాదు. ఎవరయినా వింటే వచ్చి పైకితీస్తారనే ఆశ!

ఎరువు జల్లల్లో పోసుకొంటున్న రైతులూ, జీతగాళ్ళూ రాంకోటి పడిపోవటం చూశారు. ఆ ఎడ్లబండి వెళిపోయింది. పిలుపు విన్నారు. పరుగు పరుగున వచ్చారు. కొట్టుకులాడుతున్న రాంకోటిని చూశారు. అందరివైపు చూశాడు రాంకోటి. నోటి వెంట మాటలేదు. నోరు వాలిపోయింది. ముక్కు మునుగుతూ వుంది. కళ్ళుమాత్రం అర్థంలేని నీడలు చూడగలుగుతున్నాయి.

'లాగండ్రా బైటికి!'

'కాళ్ళు పట్టుగ్గుంజండ్రా!'

'తాడేసి లాగండెహే!'

మాటలు వింటున్నాయి రాంకోటి చెవులు. కనురెప్పలు అనుతున్నాయి. శరీరం పైభాగంలో తాడువేసిన స్పర్శకూడా లేదు.

రాంకోటికి ఏమో అర్థం కాసాగింది. వాళ్లు తనను పైకి తీయరేమోనని

భయం కలిగింది. ఆ భయంలోంచి ఆశపుట్టింది.

లారీ వచ్చేస్తే.........

రాంకోటి ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు. నోరు మునిగింది. ముక్కు మునిగింది. కళ్లు మునిగాయి. నుదురు మునిగింది.

చెవులకు మాత్రం ఏవేవో శబ్దాలు వినబడుతూనేవున్నాయి. అక్కర లేని శబ్దాలు! అర్థంలేని మాటలు! అనవసరం ప్రసంగాలు! అవి విన్నా విన్నట్లు కాదు.

లారీ హారన్ వినిపించింది. రాంకోటి గుండె వేగంగాకొట్టుకొంటూ వుంది. గుండెపైన రాయిపెట్టినంత బరువు! ముక్కుదిబ్బిళ్లుపడుతూవుంది.

గుంటదగ్గర లారీ ఆగింది. 'ఏఁవయ్యిందేఁవయ్యింది' శబ్దం వినిపించింది. రాంకోటి చిన్నరాంకోటి గొంతువిన్నాడు. ఎవరో లారీలోంచి దూకిన చప్పుడు. 'నాన్నా!' గుంట దద్దరిల్లేటట్లు కేక! 'నాన్నా!' శబ్దం చెవి దగ్గరగా వినిపించింది.

రాంకోటి హృదయంలో ఆశ పువ్వయింది. కళ్ళఎదుట కనుపించని కాంతి కదులుతూవుంది. శరీరం ఎక్కడికో కూరుకుపోతున్నట్లుంది. ఆకాశం అందం కళ్లముందు నిలిచినట్లయింది. గుండె చప్పుడు పెరిగింది. రాంకోటి శరీరం అంతా మొద్దుబారి పోయిన స్పర్శ!

ఆంధ్రపత్రిక-కీలకసంవత్సరాది సంచిక (1968-69)